మినీ కథ

# "సాక్షి"

## పోలాప్రగడ జనార్దనరావు

నన్ను ఆ యింటికి తీసుకొచ్చేసరికి మా యింటాయన తల ప్రాణం తోక్కొచ్చింది ఆయన ఇంత గడ్డి కరిచినా తను అనుకున్నది సాధించానన్న తృప్తి కలిగింది నా రాక తన కష్టార్జితం, ప్రయోజకత్వం అనేవాడు తప్ప తన లంచగొండి తనం, కక్కుర్తి మూలాన మాత్రం అనుకుంటారను కొనేవాడు కాదు ఆఫీసుకి వెళ్ళినప్పుడు తప్ప మిగతా వేళల్లో నన్ను చూసు కొని మురిసిపోయే వాడు యింటి కొచ్చిన వాళ్ళందరికి నన్ను చూపెట్టి తను ఎంత కష్టపడి నన్ను పొందారో చెప్పుకునే వాడు

నాకు మాత్రం అతన్ని చూస్తే ఒళ్లు మండి పోయేది నా ఎదుట ఎన్నో ఘోరాలు జరుగుతూ వుండేవి నేను మాత్రం బొమ్మలా నాపని నేను చేసు కుంటూ పోయేదాన్ని, అంతకంటె యింకేం చెయ్యడం చేతకాక

ఆవేళ ఆదివారం, ప్రొద్దున్నుంది ఇల్లు సందడిగా ఉంది మా యింటా యన నాన్నగారొచ్చారు వాళ్ళ వూరు నుంచి

"అబ్బాయ్ ఎల్లాగో అల్లాగ వినాడ్ని జోత్యతి మీ ఆఫీసులో పెట్టి పుణ్యం కట్టుకోరా. వాడు ఎందుకూ కాకుండా పోతున్నాడని బాధతో ఏ అఘాయిత్యం చేస్తాడో అని భయంగా వుందిరా "

"నాన్నా మా ఆఫీసు లంచాల పుట్టిల్లు మరి మరి"

"నా ప్రావిడ్ంటు ఫండు బాపతు డబ్బు అప్పులకు పోను యింక రెండు వేలే మిగిలాయిరా అంతకంటే నేనేం యివ్వుకోగలను "

నా కళ్ళముందు జరుగుతున్న ఘోరానికి గుండె టకటక కొట్టుకోవ డం తప్పితే పాపం ఆ ముసలాయనకి ఏమాత్రంసాయం చెయ్యలేకపోయాను

ఆ తరువాత యింటిల్లిపాదిని అత్తా రింటికి పంపి యింట్లోనే బుల్లతో- గుడ్లతో, గుడ్డల్లేని గున్నతో రిక్రూట్ మెంటు ఆఫీసర్ని తృప్తి పరచి రెండు కన్నీటిబొట్ల న-నలో తమ్ముడికి డైయిలీ వేజస్ ఉద్యోగం, తండ్రిదగ్గర నుంచి రెండువేలూ సం పా దిం చా డు మా ప్రాప్తుడు

ఆరోజు నా గుండె ఆగినంత పనై

యింది కాళ్ళూ చేతులూ అత్తం మానేసాయి "ఎంత ఘోరం చూసాయి నా కళ్లు" అన్న షాకుతో - నా మానాన నన్ను వదిలేస్తే మా యింటాయనకి తృప్తి ఎక్కువిని మళ్ళీ నేను సరిగ్గా పని చేసేదాక నన్ను నానా యిబ్బంది పెట్టారు గుడ్డిలో మెల్ల అన్న తృప్తిగా సినిమాకెళ్ళే పెద్దలకి, స్కూలు కెళ్ళే పిల్లలకి హడావిడి పడుతున్న అయిన వాళ్ళందరికి సాయ పడుతున్నాననే ఆనందం వుండేది

చెప్పుకుంటూ పోతూ వుంటే మా యింటాయనలీలలు అనేకం ఈపాటికే ఆయనంటే ఏమిటో మీ అందరికి అర్థమయ్యే వుంటుంది ఏం చేస్తాం ఒక్కొక్క పుట్టుక అట్లాంటిది నా అన్నదమ్ములు, అప్పచెళ్ళెలు పుణ్య పురుషులతో వుంటే నాకీ ఖర్మ పట్టింది మా ముత్తాతగారు గాంధీగార్ని అన్ని వేళలా అంటి పెట్టుకొని వుండేవారట, గాంధీగారు భౌతికంగా లేకపోయినా మా ముత్తాతగార్ని మాత్రం గాంధీగారి మిత్రుడిగా ప్రజలందరూ గుర్తించి ఈనాటికి గౌరవిస్తున్నారు పుడితే అల్లాంటి పుట్టుక పుట్టాలి

నేను ఒకేలా వుంటే కథే లేదు

ఆరోజు మా ఇంటాయన్ని ఆఫీసు అంబులెన్సులో తీసుకొచ్చారు హాల్లో చాపమీద పడుకోబెట్టారు మూతివంకర పోయింది ఒక కాలూ, చెయ్యీ జీవం లేక వేళ్ళాడుతున్నాయి రాత్రికి బంధు జనం ఒక్కొక్కరేవచ్చారు ఎక్కడో వున్న కొడుకు కూడా టోల్లు డబ్బు ప్రయాణానికి పోసాడని ఏడుస్తూ వచ్చాడు నోట్లో తులసి తీర్థం పోసే టైమ్ అయ్యింది

"బాబూ యిన్నాళ్ళూ అన్యాయంగా ఎంతో సంపాదించాను అంతా పీ గురించే అవేపీ నా కూడా రావడం లేదు శవం కూడా భార్య గుమ్మం వరకు వస్తుందట బంధువులు వూరి వరకు వస్తార్ట మిత్రులు స్మశానం వరకు వస్తారట మనిషి మంచితనం మాత్రం జీవితో వస్తుందట నేను మాత్రం ఒంటరిగా వెళుతున్నా. నువ్వు మాత్రం నాలా బతుక్కు అదిగో ఆ టి వి ఆ ఫ్రిజ్, ఆ సోఫాసెట్టు, చివరకు నన్ను పడుకోపెట్టిన చాప అన్నీ నాకు లంచంగా వచ్చినవే వీటిని తగలెయ్ అదిగో అదిగో దాన్ని మాత్రం" అంటూ నాకేసి చూపించి నోటమ్మట నురగలు కక్కుతూ తనవి అనుకున్న వన్నిటినీ తన్నేసి జీవి అనంత వాయువుల్లో కలిసి పోయింది

అందరూ నాకేసి చూడ్డం మొదలు పెట్టారు

ఉద్యోగంలో వుండగా కొన్ని బిల్లులు పాస్ చేసినందుకు బహుమతి పేరుతో లంచంగా వచ్చిన నేను మాత్రం గోడకి అతుక్కు పోయి "టిక్కు టిక్కు" మంటూ "నేను ఎవరి సొత్తు ఎవరి సొంతం కాదు, యింక శవాన్ని లేపే వేళయింది" అన్నట్టుగా నా కాలూ చెయ్యీ కదిపి 'టంగ్' మని నోరు మెదిపాను ★